

6న డోన్‌కు వైఎస్ జగన్ రాక

వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 6వ తేదీన డోన్ పట్టణానికి రానున్నారు. ఏర్పాట్లను శనివారం పార్టీ నాయకులు పరిశీలించారు. 8లో▸



నాసిరకం బ్యాగులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాసిరకం బ్యాగులు ఇచ్చారు. వాటిల్లో పుస్తకాలను ఉంచుకోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.54
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.272
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:48,272
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:35,500

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్

- 5, 6 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): రుతుపవనాల ప్రభావం వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 6 తేదీ వరకు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అనంతపురం వాతావరణ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నారాయణ స్వామి తెలిపారు. ఈ నెల 5వ తేదీ ఉమ్మడి కర్నూలు జిల్లాకు విశాఖపట్టణంలోని వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ ప్రకటించిందని, 6వ తేదీన కర్నూలు జిల్లాకు ఎల్లో అలర్ట్ ఉందన్నారు. రుతుపవనాలు చురుగ్గా ఉండటం వల్ల ఆయా తేదీల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రోజుకు 64.5 నుంచి 115.5 మి.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నప్పుడు ఎల్లో అలర్ట్ ప్రకటిస్తారన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జిల్లాకు 2,520 టన్నుల యూరియా



కర్నూలు ర్యాక్ పాయింట్ నుంచి తరలుతున్న యూరియా

కర్నూలు(అగ్రికల్చర్): యూరియా కొరత నేపథ్యంలో జిల్లాకు కోరమాండల్ నుంచి 2,520 టన్నులు వచ్చింది. కర్నూలు ర్యాక్ పాయింట్ నుంచి యూరియా ఆయా ప్రాంతాలకు తరలించారు. ఇందులో 300 టన్నులు నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు, డోన్, ఆత్మకూరు ప్రాంతాల్లోని ప్రయివేటు డీలర్లు, మన గ్రోమర్ సెంటర్లకు ఇచ్చారు. మిగిలిన యూరియాలో మార్క్‌ఫెడ్‌కు 1,260 టన్నులు, 960 టన్నులు ప్రయివేటు డీలర్లు, మన గ్రోమర్ సెంటర్లకు కేటాయించారు. ప్రయివేటు డీలర్లకు ఇచ్చిన యూరియాను బ్లాక్‌లో అమ్మేసినట్లు సమాచారం. గూడూరు, వెల్దుర్తి, సీ.బెళగల్, దేవనకొండ తదితర మండలాల్లో డీలర్లు జోరుగా బ్లాక్‌లో అమ్మకాలు సాగించినట్లు తెలుస్తోంది. మరోవైపు మార్క్‌ఫెడ్ నుంచి యూరియా పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాలకు వెళ్తోంది. దీనిని కూటమి పార్టీల నేతలు తరలించుకపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఒక్క రూపాయికే 30 రోజుల ఉచిత కాల్స్

కర్నూలు(హాస్పిటల్): బీఎస్ఎన్ఎల్ నుంచి ఆజాద్ కా ఆఫర్ ద్వారా రూ.1కే 30 రోజుల పాటు ప్రతిరోజూ 2జీబీ డేటా చొప్పున ఉచిత కాల్స్, ఉచిత సిమ్ అందజేస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ జి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం మాసమైన ఆగస్టు నెలలో బీఎస్ఎన్ఎల్ ఆజాద్ కా ఆఫర్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఇతర ఆపరేటర్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అయిన వారికి కూడా నూతన ఆఫర్ వర్తిస్తుందన్నారు. వినియోగదారులు దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని/రిటైలర్‌ను సందర్శించి ఈ ఉచిత ఆఫర్‌ను పొందాలన్నారు. 4జిని ప్రారంభించిన తర్వాత డేటా స్పీడులో మంచి వృద్ధి నమోదు చేసుకున్న తరుణంలో ఈ ఆఫర్ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమన్నారు.

'కస్తూర్బా' విద్యార్థినులకు అస్వస్థత

బేతంచెర్ల: పట్టణానికి సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇద్దరు విద్యార్థినులు శనివారం అస్వస్థకు గురయ్యారు. బేతంచెర్లలోని జెండాపేటకు చెందిన 9వ తరగతి విద్యార్థిని విజయలక్ష్మికి చేతులు కాళ్లు పట్టేసి ఆయాసం వచ్చింది. అలాగే 7వ తరగతి విద్యార్థిని నాగ భవానికి ఫిట్స్ వచ్చాయి. వీరికి స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం చేశారు. విషయం తెలిసి విద్యార్థి సంఘం నాయకులు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. ఇదే విద్యాలయంలో గత నెలలో 9వ తరగతి విద్యార్థిని లలిత మాధురి మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషకాహారం అందకపోవడంతోనే ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థులను 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

చిరుత 'పల్లె'కరింపు



కూనలతో చిరుత సంచారం



➤ కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామ శివారులో ఒక చిరుత కొబ్బరి చెట్టు ఎక్కడం ఇటీవల సంచలనం రేపింది. తాను వేటాడిన ఆహారాన్ని దాచుకునేందుకు చిరుతలు చెట్లు ఎక్కుతుంటాయి. అలాగే ఇతర జంతువుల నుంచి ప్రాణ భయం ఉన్నప్పుడు కూడా చెట్లు ఎక్కుతుంటాయి. అయితే తిప్పలదొడ్డి వద్ద ప్రజల సందడికి భయపడి రక్షణ కోసం చిరుత కొబ్బరి చెట్టు ఎక్కింది.

- అడవిలో ఆహారపు కొరత
- ఆఫ్రికన్ స్వైన్‌ఫ్లూతో పందులు మృతి
- కుక్కల కోసం గ్రామాలకు వస్తున్న చిరుతపులులు

ఆత్మకూరురూరల్: చిరుత పులి ఎలాంటి ప్రాంతంలోనైనా ఉండగలదు. దట్టమైన నల్లమలలలోను, చిట్టడవులు మాత్రమే ఉన్న ఎర్రమలలోను, కంప చెట్లు, రాతి కొండలు ఉండే ఉమ్మడి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో హాయిగా బతికేస్తున్నాయి. అలాగే హైదరాబాదు, బెంగళూరు, ముంబయ్ లాంటి నగరాల శివార్లలోనూ జీవించ గలుగుతున్నాయి. ఇక గ్రామాల సంగతి చెప్పనవసరం లేదు. ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు చోట్ల చిరుతల సంచారం కనిపించడం, ప్రజల్లో కొంత ఆందోళన కలగడం జరుగుతోంది

ఆహారం కోసమే..

గ్రామాల పరిసరాల్లో చిరుతలు సంచరించడం సహజమైనదే. చిన్నపాటి దాక్కునే ప్రదేశం ఉన్నా చిరుతలు తమనుతాము దాచుకుని ఎవరికి కనిపించకుండా మనుగడ సాగించగలవు. పంట పొలాల్లో ఉండే కుందేళ్ళు, అడవి పందుల పిల్లల వంటి వన్యప్రాణులతో పాటు గ్రామాల్లోని కుక్కలను ఆహారంగా తీసుకుంటాయి. ఇటీవలి కాలంలో రాళ్ల కొండల్లో, పొదల్లో చిరుతల ఆహారం తగ్గిపోవడంతో అనివార్యంగా గ్రామాల వైపు చిరుతలు వస్తూ జనం కంట పడుతున్నాయి. గొర్ల మందల వద్ద ఉన్న కుక్కలను, ఆవుల మందల్లో ఉండే దూడలను లక్ష్యంగా చేసుకుని చిరుతలు ఆహార సేకరణ చేస్తుంటాయి.



నల్లమల అడవిలో చిరుత పులి

➤ కోసిగి ప్రాంతంలో ఇటీవల ఒక చిరుత పంట పొలాల్లో మత్తుగా పడి ఉండడం గమనించారు. దాన్ని వెంటాడి బంధించే ప్రయత్నం చేశారు. ఆ చిరుత పులి ఆతరువాత మరణించింది. దాన్ని పోస్టుమార్టం చేసిన వైద్యులు తేల్చిన సత్యం ఏమిటంటే అది ఏదో జంతువును వేటాడినపుడు ఎముక ఒకటి దాని పేగులకు పొడుచుకుని ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. అది పడుకుని ఉండగా బంధించే యత్నం చేయడంతో ఆ జంతువు ఆందోళనకు గురై హృదయ స్పందన ఆగి మృతిచెందింది.

ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కొన్ని గ్రామాల్లో చిరుతలు సంచరిస్తున్నాయి. అడవిలో ఆహారపు కొరతతోనే అవి గ్రామాలవైపు వస్తున్నాయి.



ఇదీ కారణం..

శ్రీశైలం మహాక్షేత్రంలో ఇటీవల చిరుత పులులు కాలనీల్లోని ఇళ్లలోకి కూడా వచ్చాయి. దీన్ని సునిశితంగా పరిశీలించిన అటవీ శాఖ అధికారులకు దీనికి ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ అనే వైరస్ సంబంధిత వ్యాధి కారణమని తేల్చారు. ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ వైరస్ పందులలో సంక్రమిస్తుంది. సున్నిపెంటలో కొందరు నడుపుతున్న పందుల ఫాంలోకి బెంగళూరు నుంచి తెచ్చిన పందుల వల్ల ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ అన్నది సున్నిపెంటకు చేరింది. ఈ పందులనుంచి ఆ వైరస్ అడవి పందులపై ప్రభావం చూపడంతో పెద్ద సంఖ్యలో అడవి పందులు మరణించాయి. పంది పిల్లలే ముఖ్య ఆహారంగా తీసుకునే చిరుతలకు దీనివల్ల ఆహారం కొరత ఏర్పడింది. దీంతో చిరుతలు అనివార్యంగా కుక్కలను ప్రత్యామ్నాయంగా ఎంచుకుని శ్రీశైలంలోకి తరుచూ వచ్చేవి. శ్రీశైలం దేవస్థానం వారు చిరుత ఆహారపు కొరతను గమనించకుండా పుణ్యక్షేత్రంలో సంచరించే కుక్కలను పట్టి వేరే ప్రాంతంలో వదిలారు. దీంతో చిరుతలు సున్నిపెంటల్లో ఇళ్లలో పెంచుకునే పెట్ డాగ్స్, ఇతర పెంపుడు జంతువులకోసం ఏకంగా ఇళ్ళలో ప్రవేశించ సాగాయి.

రైతులకు ఎంతో మేలు

చిరుత పులులు అడవి పందులను తిని రైతులకు ఎంతో మేలు చేస్తాయి. అడవి పందులు తమ సంతతిని విపరీతంగా పెంచుకుని మైదాన ప్రాంతాలకు విస్తరించిన సంగతి తెలిసిందే. ఇవి రైతుల పంటలను సర్వ నాశనం చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. అయితే అడవి పంది పిల్లలను అమిత ఇష్టంగా వేటాడి తినడం చిరుత ప్రత్యేకత. అందుకే చిరుత పులులు రైతుల పొలాల వెంట సంచరిస్తూ పంది పిల్లల కోసం మాటు వేస్తుంటాయి. అలా పందులసంఖ్యను నియంత్రించడం ద్వారా చిరుతలు రైతులకు మేలు చేస్తుంటాయి. కాగా.. చిరుత పులి తన ఆహార జంతువుల జాబితాలో మనిషిని ఎంచుకోలేదు. రెండు కాళ్ల జంతువులు పులుల ఆహారపు మెనూలోనే లేవు.

ఫసల్ బీమా ప్రీమియం చెల్లింపు గడువు పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నోటిఫై చేసిన పంటలకు ప్రీమియం చెల్లింపు గడవును పెంచుతూ కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీమియం చెల్లింపు గడువు జూలై నెలాఖరుతో ముగిసినా.. జూలై 30, 31 తేదీల్లో సర్వర్ పనిచేయకపోవడం వల్ల పంట సాగు చేసినట్లు సర్టిఫికెట్ జనరేట్ కాక ప్రీమియం చెల్లించలేకపోయారు. ఈ విషయం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ దృష్టికి వెళ్లడంతో గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందని రైతులు ఈ నెల 14 వరకు ప్రీమియం చెల్లించవచ్చు. బ్యాంకుల నుంచి రుణాలు పొందే రైతులు ఈ నెల 31 వరకు ప్రీమియం చెల్లించవచ్చు. బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందే రైతులు తీసుకునే పంట రుణం నుంచి ప్రీమియం అమౌంటును కట్ చేయాలని బ్యాంకర్లను కోరాల్సి ఉంది. నాన్‌లోనీ ఫార్మర్స్‌కు ఇప్పటికీ సర్వర్ మొరాయిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద 10,638 మంది రైతులు 15,108.81 హెక్టార్లకు ప్రీమియం చెల్లించారు. వాతావరణ ఆధారిత బీమా కింద 11,011 మంది రైతులు 15,312.48 హెక్టార్లకు ప్రీమియం చెల్లించారు.

సారూ.. న్యాయం చేయండి



రైతు ఇచ్చిన అర్జీని చూస్తున్న జిల్లా కలెక్టర్

ఎమ్మిగనూరురూరల్: పొలం తక్కువ ఉందని చూపారని.. సారూ.. మీరే న్యాయం చేయాలని బనవాసి కేవీకేకు వచ్చిన జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు పార్లపల్లి గ్రామానికి చెందిన రైతు చిన్నహనుమన్న అర్జీ ఇచ్చారు. తనకు 7.75 ఎకరాల భూమి ఉండగా రీ సర్వేలో 50 సెంట్లు తక్కువగా అధికారులు చూయిస్తున్నారని, తహసీల్దార్‌కు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ భూమి 50 సెంట్ల భూమి వేరే వారి పేరున ఆన్‌లైన్లో చూపుతోందని, సమస్యను పరిష్కరించాలని అర్జీని ఇచ్చారు. దానిని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు అప్పగించి విచారించి న్యాయం చేస్తామని రైతుకు జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, చిత్రంలో ఫ్యాప్టో నాయకులు

- ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

కర్నూలు(సెంట్రల్): విద్యాశాఖలో ఇటీవల పదోన్నతి, బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. అధికారులను కలిసినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఫ్యాప్టో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సేవాలాల్ నాయక్, భాస్కర్ విమర్శించారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ధర్నాను రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ కాకి ప్రకాష్‌రావు ప్రారంభించగా జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఏడాది గడిచినా 12వ పీఆర్‌సీని నియమించలేదని, నాలుగు పెండింగ్ డీఏలు ఇవ్వలేదని, ఈపీఎఫ్, ఇతర అలవెన్స్‌లను జమ చేయడంలేదని విమర్శించారు. 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కరే కృష్ణ, ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, మండల విద్యాధికారుల సంఘం నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డెక్కాల్సిన పరిస్థితి కల్పించారు

ఉపాధ్యాయ సమస్యలపై చర్చించేందుకు విద్యాశాఖ మంత్రి సమయం ఇవ్వడంలేదు. అందువల్ల బోధనకు విరామం ప్రకటించి రోడ్లపైకి రావాల్సి వస్తోంది. పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఆ ఊసెత్తకపోవడం దుర్మార్గం. ఈనెల 12లోపు సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.

– ప్రకాష్‌రావు, ఫ్యాప్టో రాష్ట్ర కోచైర్మన్

ఉద్యోగులను మభ్యపెడుతున్నారు

తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తరువాత దానిని పట్టించుకోవడంలేదు. పీఆర్‌సీ గడువు పూర్తయి రెండు సంవత్సరాలు గడిచిపోయినా కొత్త కమిషన్‌ను ఎందుకు నియమించడంలేదు. ఇది ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లను మభ్యపెట్టడమే.

– తిమ్మన్న, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు

తీవ్ర పరిణామాలు తప్పవు

గత ప్రభుత్వ హయాంలో పీఆర్‌సీ ఉద్యమానికి నాంది పలికాం. మళ్లీ ఇప్పుడు పోరాటాలకు దిగాల్సి వస్తోంది. ఉపాధ్యాయులకు సంబంధించి ఆర్థిక అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదు.

– సురేష్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు

వరద నీటి సద్వినియోగంలో విఫలం

ఇంజనీర్ల నిర్లక్ష్యంతో 20 నుంచి 30 టీఎంసీల నీరు సముద్రం పాలు

- సకాలంలో రైతులకు యూరియా అందక ఇబ్బందులు
- మినరల్ వాటర్ ప్లాంట్ కూల్చివేతపై చర్యలేవి
- జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి



హాజరైన అధికారులు, జెడ్పీటీసీలు

కర్నూలు(అర్బన్): ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని సద్వినియోగం చేసుకోవడంలో జల వనరుల శాఖ ఇంజనీర్లు పూర్తి స్థాయిలో విఫలమయ్యారు. ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుత ఖరీఫ్‌లో కూడా పంటలు ఎండిపోయి, తాగునీరు అందని పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది. శ్రీశైలంలో 854 అడుగుల మేరకు నీరు ఉంటే పోతిరెడ్డిపాడుకు నీటిని విడుదల చేసుకునే అవకాశం ఉన్నా, ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో నీటి పారుదల అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ సకాలంలో చర్యలు చేపట్టకపోవడం వల్ల గత మూడు రోజులుగా 20 నుంచి 30 టీఎంసీల నీరు సముద్రం పాలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి విడుదలకు సంబంధించి కేఆర్ఎంబీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పలువురు ఇంజనీర్లు చెప్పగా, వరద ప్రవాహాన్ని ముందుగానే అంచనా వేసి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాల్సిన బాధ్యత మీకు ఉంది కదా ? అని ఆయన ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి తెలంగాణ వారు ఏ విధంగా నీటిని వినియోగించుకుంటున్నారో మీకు తెలియదా అని ప్రశ్నించారు. మే చివరి నాటికి హెచ్ఎన్ఎస్ఎస్ పనులను పూర్తి చేసి ఉంటే, ఇప్పటికే గాజులదిన్నెలో కనీసం మూడు టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండేది కదా, జూన్ నెలాఖరు వరకు కాలువ వైడనింగ్, లైనింగ్ పనులు చేపట్టడం వల్ల ఇప్పటి వరకు కేవలం 0.2 టీఎంసీల నీరు కూడా జీడీపీకి చేరలేదని ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా మనకు అరకొర వర్షాలు కురుస్తున్నా, దేవుని పుణ్యాన ఎగువన వర్షాలు కురవడంతో మనకు వరద నీరు వస్తోందని, అనుకోకుండా వరద నీరు ఆగిపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే పలువురు ఇంజనీర్లు చెప్పిన సమాధానాల పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

సకాలంలో యూరియా అందక ఇబ్బందులు

రైతులకు సకాలంలో యూరియా అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్లాక్ మార్కెట్‌లో ఒక బస్తా యూరియాను రూ.500 పెట్టి కొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని కొత్తపల్లి జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి కలుగజేసుకుంటు రబీ సీజన్‌లో యూరియా కొరత తీవ్ర రూపం దాల్చిన సమయంలోనే రానున్న ఖరీఫ్‌లోనైనా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియాను అందించాలని స్థాయీ సంఘ సమావేశాలు, జనరల్ బాడీ సమావేశాల్లోను అధికారులను కోరామన్నారు. అయినా, ప్రస్తుత ఖరీఫ్‌లో యూరియా లభించక రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన పెంచాలి

కరువు జిల్లా అనంతపురం నేడు పండ్ల తోటల పెంపకంలో అగ్రగామిగా ఉందని, అన్ని రకాల పండ్లను అక్కడి రైతులు పండిస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూధన్ చెప్పారు. అయితే కర్నూలు జిల్లాలో మాత్రం మిర్చి, ఉల్లి, టమోటా, పత్తి తదితర పంటలపైనే రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. వివిధ రకాల పండ్ల తోటలను సాగు చేసుకునేందుకు ఇక్కడి రైతులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఆయా పండ్లకు సంబంధించిన మార్కెటింగ్‌పై కూడా రైతులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈలు మహేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు బి.నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణులు బీ రాధిక, చింతామణి, జెడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, సుంకన్న, రఘునాథరెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, జగదీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామక్రిష్ణ, రంగనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ కూల్చివేతపై చర్యలేవి

బనగానపల్లె పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూల్చివేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని చైర్మన్ పాపిరెడ్డి ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను కూడా పనిచేయకుండా చేసి పోలీసుల సాయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూల్చారనే వాదనలు వినిపిస్తున్నాయని, ఈ ఘటనపై ఏమి చర్యలు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిణి లలితాబాయి మాట్లాడుతూ జరిగిన ఘటనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని.. అలాగే పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీఓ ఆధ్వర్యంలో నివేదికలు తయారు చేస్తున్నారన్నారు.

క్లుప్తంగా

రామ్‌కోలో కార్మికుడి మృతి

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో జీవనోపాధి కోసం పని చేసేందుకు వచ్చిన ఓ కార్మికుడు శనివారం ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా లొడ్డపుట్టి గ్రామానికి చెందిన దోలుపత్ర దాల్చిని (49) రామ్‌కోలో రాజవర్ధన్ కాంట్రాక్టర్ కింద పనులు చేసేందుకు వచ్చాడు. రోజు మాదిరిగానే పనికి వెళ్లిన అతను పని చేసే సమయంలో అకస్మాతుగా కింద పడిపోవడంతో తలకు గాయమైంది. తోటి కార్మికులు ఫ్యాక్టరీ ఆవరణలోని ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం తాడిపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆదివారం సాయంత్రానికి ఇక్కడికి చేరుకునే అవకాశం ఉంది.

108 సిబ్బంది నిజాయితీ


ధనుంజయకు డబ్బు అప్పగిస్తున్న ఈఎంటీ వీరేష్

ఆస్పరి: రోడ్డు ప్రమాదంలో గాడపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించడమే కాకుండా ఆయన దగ్గరున్న డబ్బులను బంధువులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు ఆస్పరి 108 సిబ్బంది. అట్టికల్లు గ్రామానికి చెందిన హరికృష్ణ శుక్రవారం పనిమీద ఆస్పరికి వచ్చి రాత్రి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అట్టికల్లు సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో హరికృష్ణకు రక్తగాయాలయ్యాయి. సమాచారంతో ప్రమాద స్థలానికి చేరుకున్న 108 పైలెట్ వీరస్వామి, ఈఎంటీ వీరేష్ క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స చేసి ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి వద్దనున్న రూ.1.68 లక్షలను అతని తమ్ముడు ధనుంజయను పిలిపించి ఆసుపత్రిలోనే పైలెట్, ఈఎంటీ అప్పగించారు. దీంతో 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాలల నుంచి కేంద్ర ప్రభుత్వ జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ విజయ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సామాజిక సేవ, సంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, ధైర్య సాహసాలు, క్రీడలు, కళలు, సంస్కృతి తదితర వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఆసక్తి, అర్హత కలిగిన వారు https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర కమిటీ ద్వారా ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించడం జరుగుతుందన్నారు.

గృహ హింసపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు ...

గృహ హింస చట్టంపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఐసీడీఎస్ పీడీ విజయ కోరారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు గృహ హింస చట్టం 2025 అమలుకు సంబంధించి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది పూర్తిగా అవాస్తవమని, మహిళలకు రక్షణ కల్పించే గృహ హింస చట్టం అమలు బాధ్యత పూర్తిగా మహిళా శిశు సంక్షేమ శాఖకు మాత్రమే ఉందని ఆమె స్పష్టం చేశారు.

స్ఫూర్తి కెరటం

- బ్యాంక్ ఉద్యోగం చేస్తూ సివిల్స్‌కు ప్రిపేర్
- తండ్రి కోరికను నెరవేర్చిన కుమార్తె
- ఎమ్మిగనూరు డీఎస్పీగా భార్గవికి మొదటి పోస్టింగ్

రిజర్వ్ బ్యాంక్‌లో ఉద్యోగం...ఆరు అంకెల జీతం.. మెట్రో నగరాల్లో జీవితం..ఇంతకుమించి ఇంకేం కావాలనుకుంటారు ఎవరైనా..! కానీ ఇవేవి ఆమెకు సంతృప్తిని ఇవ్వలేదు...ప్రజా సర్వీసుల్లో తన కూతురుని చూడాలన్న తండ్రి ఆశయం ముందు.! అందకే ఆమె ఓ వైపు కుటుంబాన్ని, మరోవైపు ఉద్యోగం నిర్వహిస్తూనే సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యారు. కఠోర శ్రమతో గ్రూప్–1 పరీక్షలో సత్తా చాటి తండ్రి కల నేరవేర్చారు ఎం.ఎస్. భార్గవి. ఎమ్మిగనూరు డీఎస్పీగా తొలి పోస్టింగ్‌ను అందుకుని, విధుల్లో చేరిన ఆమె ప్రయాణం యువతరానికి స్ఫూర్తిదాయకం. – ఎమ్మిగనూరు రూరల్


జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు బొకే ఇస్తున్న డీఎస్పీ ఎం.ఎస్.భార్గవి (ఫైల్)

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు ఉద్యోగాలను వద్దనుకుని తన కల నెరవేర్చుకున్నారు ఇటీవల ఎమ్మిగనూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎం.ఎస్ భార్గవి. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం చెందిన జానార్ధన్ రావు, లలిత దంపతులకు ఎంఎస్. భార్గవి, దివ్య, మురళీకృష్ణ సంతానం. జానార్ధన్‌రావు జనరల్ ఇన్సూరెన్స్‌లో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. తల్లి లలిత గృహిణి. వీరి మొదటి కుమార్తె ఎంఎస్. భార్గవి 10వ తరగతి వరకు తాడెపల్లిగూడెంలో, ఇంటర్ విజయవాడలో చదువుకున్నారు. ఆ తర్వాత వరంగల్‌లో ఈసీబీటీసీ (ఎన్‌ఐటీ)లో పూర్తి చేశారు. తన చెల్లెలు డాక్టర్ దివ్య హైదరాబాద్‌లో హోమియో ఎండీగా పనిచేస్తుండగా, తమ్ముడు డాక్టర్ మురళీకృష్ణ గ్యాస్ట్రో ఎండీగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. చెల్లి, తమ్ముడు డాక్టర్లు అయినా తను ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా తన లక్ష్యం గ్రూప్స్‌పైనే ఉండేది. వరంగల్‌లో ఈసీబీటీసీ చదువతుండగానే క్యాంపస్ సెలెక్షన్‌లో మోటో సెల్ ఫోన్ కంపెనీలో ఉద్యోగం పొంది హైదరాబాద్‌లో ఒక సంవత్సరం చేశారు. ఆ ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతూ బ్యాంక్ ఉద్యోగాలకు పరీక్ష రాయగా ఓరియంటెల్ బ్యాంక్‌లో ఉద్యోగం సాధించి 8 నెలలు పని చేశారు. ఆ క్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ముంబాయిలోని రిజర్వ్ బ్యాంక్‌లో నాలుగున్నరేళ్ల పనిచేసి హైదరాబాద్ ఆర్‌బీఐకు బదిలీపై వచ్చారు. అక్కడ విధులు నిర్వహిస్తూనే సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికై ఐఆర్‌టీసీ (రైల్వేశాఖ)లో ఉద్యోగం వచ్చినా అందులో చేరలేదు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



ఎవరైనా అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలంటే పట్టుదలతో చదవాలి. నేను గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నప్పుడు ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయలేదు. ఇప్పుడు ఉన్న సౌకర్యాలు అప్పుడు మాకు లేవు.. ఉన్న దాంట్లో కష్టపడి చదివాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో నా లక్ష్యాన్ని చేరుకున్నా. డీఎస్పీగా బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తా.

– ఎం.ఎస్. భార్గవి, డీఎస్పీ, ఎమ్మిగనూరు

ఓ వైపు కుటుంబం, మరో వైపు ఉద్యోగం.. అయినా..

బ్యాంక్ జాబ్ చేస్తున్నా తన తండ్రి జనార్దనరావు ఆశయాన్ని నెరవేర్చాలని గ్రూప్స్‌ను మాత్రం వదల్లేదు. బ్యాంక్ జాబ్ చేస్తుండగానే గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మురళీకృష్ణతో వివాహమైంది. వీరికి కుమారుడు శ్రేయస్ (3), రెండున్నర ఏళ్ల కుమార్తె మనోజ్ఞ ఉన్నారు. కాగా భర్త హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తుండగా, భార్గవి ఆర్‌బీఐలో పని చేసేవారు. ఓ వైపు బ్యాంక్ ఉద్యోగం చేస్తూ, మరో వైపు కుటుంబాన్ని చూసుకుంటూ తన లక్ష్యాన్ని మాత్రం మరవలేదు. పట్టుదలతో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలో విజయాన్ని సొంతం చేసుకొని డీఎస్పీగా ఎంపికయ్యారు. అనంతపురం పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొంది ఎమ్మిగనూరు డీఎస్పీగా మొదటి పోస్టింగ్‌లో చేరారు. మహిళా డీఎస్పీగా విధుల్లో చేరి యువతి, యువకులకు స్ఫూర్తిగా నిలిచారు.

కేఎంసీలో ర్యాగింగ్‌పై మంత్రి ఆరా

- పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశం


యాంటి ర్యాగింగ్ కమిటీతో చర్చిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల (కేఎంసీ)లో ర్యాగింగ్ ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ర్యాగింగ్ జోలికి వెళ్లాలంటేనే భయపడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. యాంటి ర్యాగింగ్ కమిటి నివేదికను అందజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మను ఆదేశించారు. ఆమెతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్, యాంటి ర్యాగింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం రంగంలోకి దిగి వార్డెన్‌ను, హాస్టల్‌లో ప్రథమ, మూడవ సంవత్సరం విద్యార్థులతో చర్చించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వినాయక చవితి చందాల కోసమే వివాదం..

కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ జరగలేదని, కేవలం వినాయక చవితి చందాల కోసమే వివాదం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం ప్రకటించారు. తాను, ర్యాగింగ్ కమిటీ సభ్యులు కలిసి విద్యార్థులతో కూర్చుని మాట్లాడినట్లు తెలిపారు. వారితో లిఖిత పూర్వక సమాధానాలు తీసుకున్నామని, ఎక్కడా కూడా విద్యార్థులు ర్యాగింగ్ చేసినట్లుగా లేదన్నారు. మొదటి సంవత్సవరం విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం అవుతున్నారని, ఈ సమయంలో ఉత్సవాల అంశాన్ని ర్యాగింగ్ పేరుతో ప్రచారం చేశారని, ఇది విద్యార్థులకు నష్టం కలిగిస్తుందని అన్నారు. విద్యార్థులు ఎవ్వరైనా ర్యాగింగ్‌కు గురైనట్లు తమ దృష్టికి తీసుకొస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

6న డోన్‌కు వైఎస్ జగన్ రాక


వివాహ రిసెప్షన్ వేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

డోన్: డోన్ పట్టణానికి ఈనెల 6వ తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి, దివంగత నీలం సంజీవరెడ్డి ముని మనవరాలు అనన్యరెడ్డి వివాహ రిసెప్షన్‌కు వైఎస్ జగన్ హాజరై నవ దంపతులను ఆశీర్వదించనున్నారు. ఈ మేరకు వివాహ రిసెప్షన్ వేదికతో పాటు వెంకటాపురం రోడ్డులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి శనివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జున రెడ్డి, పార్టీ నాయకులు గజేంద్రనాథ్‌రెడ్డి, క్వాలిటీ అబ్దుల్లా, చంద్రశేఖర్ రెడ్డి, దినేష్‌గౌడ్, కురుకుంద హరి, మల్యాల శ్రీనివాసరెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమ విద్యార్థినులకు బంగారు పతకాలు


విద్యార్థినులను సన్మానిస్తున్న రెండు జిల్లాల సంక్షేమ సాధికారత అధికారిణులు

కర్నూలు(అర్బన్): కర్నూలులో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ మీట్‌లో నగరంలోని నెంబర్ 1 ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించడం గర్వ కారణమని కర్నూలు, నంద్యాల జిల్లాల సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణులు బీ రాధిక, చింతామణి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థినులకు వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ 20 అథ్లెటిక్స్ మీట్‌లో జే అనిత 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. అలాగే మరో విద్యార్థిని ఎం రజిత షార్ట్ పుట్, లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్స్ సాధించారని చెప్పారు. సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా జాతీయ స్థాయిలో రాణించడం గర్వ కారణమన్నారు. హాస్టల్ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న వసతి గృహ సంక్షేమాధికారి బీ బెన్నమ్మను వారు ప్రత్యేకంగా అభినందించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను వారు శాలువాలు కప్పి, సర్టిఫికెట్లను అందించి సన్మానించారు.


ఆటోలోని టిన్‌లో సారాను గ్లాస్‌లో పోసుకుంటూ..


మద్యం మత్తులో జాతీయ రహదారిపై కూర్చుని..

తాగి తూగిన 'తెలుగు తమ్ముళ్లు'

మంత్రాలయం: అన్నదాత సుఖీభవ మాట దేవుడెరుగు. రాఘవేంద్రుడి సాక్షిగా.. అధికారుల ఎదుట తెలుగు తమ్ముళ్లు తాగి తూగారు. మత్తులో జోగుతూ సభా స్థలిలో హంగామా చేశారు. నిండు సభ జరుగుతున్న సమయంలో ఓ కార్యకర్త ఏకంగా స్టేజీపైకి ఎక్కి తాగిన మైకంలో ఈలలు వేశాడు. అదే వ్యక్తి వక్తలు ప్రసంగిస్తున్న సమయంలో స్టేజీ వైపు తూలుతూ పోతుండగా పోలీసులు వారించి నెట్టివేశారు. విచిత్రమేంటంటే క్షేత్రం పవిత్రతను మరిచి తమ్ముళ్లు నడుచుకోవడం స్థానికుల్లో చర్చగా మారింది. అంతేకాదండోయ్.. ఇక్కడ మరీ ముఖ్యంగా నాటుసారా టిన్‌లు సైతం దర్శనమిచ్చాయి. కొందరు టిన్‌లలో నాటుసారా తెచ్చుకుని ఏకంగా రెవెన్యూ కార్యాలయం ఎదుటే తాగుతూ కానిచ్చారు. మరికొందరు కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తెచ్చుకుని ఫూటుగా తాగారు. ఓ కార్యకర్త ఏకంగా జాతీయ రహదారిపై పడుకుని వాహనాలకు అంతరాయం కల్గించాడు. టీడీపీ కార్యకర్తలు తూలడం చూసి స్థానికులు విస్తుపోయారు.


స్టేజీ వద్ద తాగి తూగుతున్న టీడీపీ కార్యకర్తను పక్కకు తీసుకెళ్తున్న కానిస్టేబుళ్లు

అధిక ఫీజు వసూళ్లపై విచారణ

ఎమ్మిగనూరుటౌన్: నిబంధనలు పాటించకుండ విద్యార్థుల నుంచి అధిక ఫీజు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై పట్టణంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై శనివారం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి విచారణ జరిపారు. ఇందులో భాగంగా స్థానిక భాష్యం పాఠశాలలో విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేసిన వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ కవితను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌టీఈ యాక్ట్ కింద విద్యార్థులకు ఎన్ని సీట్లు కేటాయించారని, వారిని ఫీజులెందుకు అడిగారని ప్రశ్నించారు. పాఠశాలలో ఫీజు పట్టికను నోటీసు బోర్డ్‌లో ఎందుకు ప్రదర్శించ లేదని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఎంఈఓలు ఆదేశించినా ఎందుకు స్పందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం నిబంధనలు పాటించకుండ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని జైభీమ్ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్యతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు డిప్యూటీ డీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట ఎంఈఓ 2 మధుసూదన్‌రాజు తదితరులు ఉన్నారు.


భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న డిప్యూటీ డీఈఓ

నాసిరకం బ్యాగులు


లాడలు తెగిపోవడంతో భుజాన మోసుకెళ్తూ..


చిరిగి పోయిన బ్యాగులతో విద్యార్థులు..

అంతన్నారు.. ఇంతన్నారు. బడి పిల్లల బ్యాగులు.. బాగు బాగు అంటూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ వాటిని ప్రదర్శించారు. ప్రభుత్వం సరఫరా చేసే విద్యార్థుల బ్యాగులను చూపిస్తూ నాణ్యతతో తయారీ చేయించామని గొప్పలు చెప్పారు. మంత్రి మాటలు తేలిపోయేలా బ్యాగుల డొల్లతనం రెండు నెలలకే బయట పడింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందించిన బ్యాగులు ఎక్కడికక్కడ పిగిలిపోతున్నాయి. లాడలు తెగిపోవడంతో వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. బ్యాగుల తయారీకి ఉపయోగించిన క్లాత్ నాణ్యత లేకపోవడంతో కుట్లు వేసినా చిరిగిపోతున్నాయి. భుజాన వేసుకుని హాయిగా పాఠశాలకు రావాల్సిన విద్యార్థులు అతి కష్టం మీద అవస్థలు పడుతూ పుస్తకాల బ్యాగ్ తెచ్చుకుంటున్నారు. ఈ దృశ్యాలు కర్నూలు నగర శివారులోని పెద్దపాడు పాఠశాలలో కనిపించాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


పిగిలిపోయిన బ్యాగ్‌తో బడికి..


జిప్‌లు పోయి, చిరిగిపోయిన బ్యాగులు చూపుతున్న దృశ్యం

తుంగభద్రకు తగ్గిన వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదికి వరద ప్రవాహం తగ్గింది. శనివారం ఉదయం 33,000 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, సాయంత్రం 6 గంటలకు కోట్ల (సుంకేసుల డ్యామ్) బ్యారేజీకి 25 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం ఉన్న ప్రవాహంలో గేట్ల ద్వారా 15,516 క్యూసెక్కులు శ్రీశైలానికి, కేసీ కాలువకు 1,847 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. టీబీ డ్యాం ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో డ్యాంగేట్లు పైకెత్తి గత నెల 2వ తేదీ నుంచి నదిలోకి వరద నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు బ్యారేజీకి 129 టీఎంసీలకు పైగా చేరిన నీటిలో శ్రీశైలం రిజర్వాయర్‌కు 126 టీఎంసీలు, కేసీ కెనాల్‌కి 3 టీఎంసీలు విడుదల చేశారు.